AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
11-10-2025 (Saturday) MAIN EDITION

## సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** దేశవ్యాప్తంగా సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్ష నిర్వహించను న్నారు. అక్టోబర్ 10 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2026-27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, తొమ్మిదో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.700, జనరల్, ఓబీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలు రూ.850 కట్టాలి. అక్టోబర్ 31 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2026 జనవరిలో పరీక్ష ఉంటుంది.

## శాంసంగ్ గెలాక్సీ M17 భారత్‌లో లాంచ్..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** స్మార్ట్‌ఫోన్ ప్రేమికులకు శాంసంగ్ ఇండియా మరోసారి సర్‌ప్రైజ్ ఇచ్చింది. ప్రముఖ సౌత్ కొరియా టెక్ బ్రాండ్ శాంసంగ్ తన పాపులర్ గెలాక్సీ ఎం సిరీస్‌లో కొత్త మోడల్ గెలాక్సీ ఎం17ను అధికారికంగా భారత్‌లో విడుదల చేసింది. తాజా ఎం17 మోడల్ ఎన్నో ఆకర్షణీయ ఫీచర్లతో, ప్రత్యేకించి ఏఐ ఫీచర్లు, 50ఎంపీ కెమెరా, వన్ యూఐ 7, ఆండ్రాయిడ్ 15 వంటి ఆధునిక స్పెసిఫికేషన్లతో మార్కెట్లోకి అడుగుపెట్టింది. అక్టోబర్ 13 నుంచి అమెజాన్, శాంసంగ్ అధికారిక వెబ్‌సైట్, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో లభించనుంది. ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై డిస్కౌంట్, స్పెషల్ లాంచ్ డీల్స్ అందుబాటులో ఉన్నాయి.

## జగన్ లండన్ పర్యటన..



**అక్షరటుడే, అమరావతి:** ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ విదేశీ పర్యటనకు వెళ్లారు. తన సతీమణి వైఎస్ భారతితో కలిసి ఆయన శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి లండన్‌కు పయనమయ్యారు. కుటుంబ సభ్యులతో సమయం గడిపేందుకు పర్యటనకు వెళ్లినట్లు సమాచారం. ఆయన పెద్ద కుమార్తె హర్ష ప్రస్తుతం లండన్‌లో ఉంటున్నారు.

## సినీ నటుడు శ్రీకాంత్‌పై ఫిర్యాదు



**అక్షరటుడే, హైదరాబాద్ :** సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాంత్ ఇటీవల మహాత్మా గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో శ్రీకాంత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బల్మూరి వెంకట్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## 14న తెలంగాణ బంద్..



**అక్షరటుడే, హైదరాబాద్:** స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీసీ నేత, ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 14న తెలంగాణ బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్‌కు పిలుపునిచ్చామన్నారు.

## 16న ఏపీలో పర్యటించనున్న ప్రధాని

**అక్షరటుడే, అమరావతి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ తాజాగా విడుదలైంది. ఏపీలోని కర్నూల్‌కు మోదీ రానున్నారు. శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. అనంతరం రాగమయూరి గ్రీన్ హిల్స్ వెంచర్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలో మాట్లాడతారు.

## పాకిస్థాన్‌కు రక్షణ రహస్యాలు చేరవేస్తున్న వ్యక్తి అరెస్ట్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్‌కు గూఢచార్యం చేస్తున్న పలువురిని భారత నిఘా వర్గాలు అరెస్ట్ చేశాయి. ప్రత్యేక తనిఖీలు చేపట్టి చాలా మందిని అదుపులోకి తీసుకున్నాయి. తాజాగా మళ్లీ పలువురిని అధికారులు అరెస్ట్ చేస్తున్నారు. హనీట్రాప్‌లో చిక్కుకొని రాజస్థాన్‌కు చెందిన మంగత్ సింగ్ అనే వ్యక్తి పాక్ మహిళకు భారత రక్షణశాఖ రహస్యాలను పంపించాడు. దీంతో రాజస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు.



## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. వాయువ్య పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని పోలీసు శిక్షణ పాఠశాలపై ఈ దాడి జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు మరణించారని పోలీసులు తెలిపారు. డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని పోలీసు శిక్షణ పాఠశాల ప్రధాన ద్వారాన్ని ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన ట్రక్కుతో శుక్రవారం రాత్రి ఢీకొట్టారు. దీంతో భారీ పేలు డు సంభవించింది. ఉగ్రవాదులు ఆ ప్రాంగణంలోకి చొరబడి విచక్షణా రహి తంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో మొత్తం ఏడుగురు పోలీసు సిబ్బంది మరణించగా, మరో 13 మంది గాయపడ్డారు. కాగా.. ప్రతీకార కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు మొదటగా హతమయ్యారు. క్లియరెన్స్ ఆపరేషన్‌లో, మరో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు.

**స్థానిక సంస్థల ఎన్నికల అంశం ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. హైకోర్టు తాజా తీర్పు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 42 శాతం బీసీ రిజర్వేషన్ల జీవోపై స్టే విధించిన న్యాయస్థానం.. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేసింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని తేల్చి చెప్పింది. తద్వారా ఎన్నికల అంశాన్ని అటు ప్రభుత్వం, ఇటు ఎన్నికల సంఘంపైకి నెట్టేసింది. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వం, ఈసీ తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్న దానిపైనే అందరి దృష్టి నెలకొంది.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# ముందుకా.. వెనక్కా..?




- హైకోర్టు తీర్పుపై ఈసీ మంతనాలు
- ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేదన్న కోర్టు
- పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్
- న్యాయ నిపుణులతో ఎన్నికల సంఘం చర్చలు
- స్థానిక పోరుపై ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్
- 15న జరిగే కేబినెట్ భేటీపైనే అందరి దృష్టి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో రిజర్వేషన్లను పెంచకుండా పాత విధానంలో ఎన్నికలు నిర్వహించేందుకు అడ్డంకులు లేవని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మోహియొద్దీన్ తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలును మాత్రమే నిలిపివేస్తున్నట్టు, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేయలేదని స్పష్టం చేసింది. నోటిఫికేషన్ ప్రకారం పాత విధానంలో అంటే బీసీలకు 25 శాతం, ఎస్సీలకు 15, ఎస్టీలకు 10 శాతం చొప్పున కేటాయిస్తూ ఎన్నికలు నిర్వహించవచ్చని స్పష్టంచేసింది.

స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా దృష్టి సారించింది. జీవో నెం.9పై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ఈసీ రెండు రోజుల క్రితం ప్రకటన విడుదల చేసింది. అయితే, తాజాగా హైకోర్టు ఉత్తర్వులు బయటకు రావడంతో ఈసీ పునరాలోచనలో పడింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో తదుపరి చర్యలపై రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఈ మేరకు శనివారం న్యాయ నిపుణులతో సమావేశమైంది. హైకోర్టు ఉత్తర్వులపై న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చలు జరిపింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు తదుపరి ఎన్నికలు వెళ్లాలా.. లేదా ? అన్న అంశంపై చర్చించింది. మరోవైపు, పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరాలని యోచిస్తున్న ఈసీ.. ఈమేరకు సర్కారుకు లేఖ రాయాలని భావిస్తోంది.

### ప్రభుత్వ నిర్ణయంపైనే ఆధారం..

స్థానిక ఎన్నికల్లో జోక్యం చేసుకోలేదని హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో.. అందరి దృష్టి ప్రభుత్వంపై నెలకొంది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికల నిర్వహణపై ముందుకెళ్తారా.. లేక 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమయ్యే వరకూ వాయిదా వేస్తారా? అన్నది సందిగ్ధంగా మారింది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగానే ఈసీ ముందుకెళ్లనుంది. ఈ నేపథ్యంలో సర్కారు ఏ నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లాలని రేవంత్ సర్కారు పట్టుదలతో ఉంది. అందుకే హైకోర్టు స్టేపై సుప్రీంకు వెళ్లాలని యోచిస్తోంది. ఈ వ్యవహారంపై చర్చించేందుకు ఈ నెల 15న రాష్ట్ర కేబినెట్ భేటీ కానుంది.

## చైనాపై 100 శాతం టారిఫ్‌లు విధించిన ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ చైనాపై కఠిన నిర్ణయం తీసుకున్నారు. చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ కొత్త టారిఫ్‌లు నవంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. చైనా అరుదైన ఖనిజాలపై ఆంక్షలు విధించడంతో తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకు చైనాపై 30 శాతం టారిఫ్‌లు అమలు చేస్తున్న విషయం తెలిసిందే. రాబోయే రెండు వారాల్లో దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరగనున్న సమావేశం ముందు ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కాగా.. వీరి భేటీ రద్దయ్యే అవకాశం ఉంది.

## ప్రతిపక్ష పార్టీపై నిప్పులు చెరిగిన ప్రధాని



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** కాంగ్రెస్ పార్టీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. శనివారం న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ లో జరిగిన ప్రత్యేక కృషి కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో అధికారంలో యూపీఏ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విస్మరించిందన్నారు. అయితే ఎన్డీఏ అధికారంలోకి వచ్చినప్పటి నుండి సాగురంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. గత 11 సంవత్సరాలలో రైతులను బలోపేతం చేయడానికి, స్వావలంబన సాధించడానికి అనేక చర్యలు చేపట్టామన్నారు.

## నకిలీ కోల్గేట్ పేస్ట్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** గుజరాత్‌లోని కచ్‌లో పోలీసులు వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు కలిగించే భారీ రాకెట్‌ను ఛేదించారు. చిత్రోడ్ ప్రాంతంలోని ఒక ఫ్యాక్టరీపై శుక్రవారం దాడి చేశారు. నకిలీ కోల్గేట్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. నిందితులను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9.43 లక్షల విలువైన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## తెలంగాణ ఐకానిక్‌గా టీస్క్వేర్ నిర్మాణం: సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్:** టీ స్క్వేర్ నిర్మాణం తెలంగాణ ఐకానిక్‌గా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ హబ్, టీస్క్వేర్ ప్రాజెక్టులపై ఐసీసీసీలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, టీజీఐఐసీ సంయుక్తంగా ఈ రెండు ప్రాజెక్టులు చేపడుతున్నాయి. రాయదుర్గం సమీపంలో చేపట్టనున్న టీస్క్వేర్ నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరుకు ప్రారంభించాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. టీస్క్వేర్‌లో ఆపిల్ వంటి అంతర్జాతీయ సంస్థల ఔట్‌లెట్లు ఉండాలని పేర్కొన్నారు. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ భవనాలను పరిశీలించాలని సూచించారు. ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ ఏఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఖర్చులపై ఈసీ కఠిన నిర్ణయం





**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరగబోయే ఉప ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు చేసే ప్రచార వ్యయాలపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి పెట్టింది. వ్యయాల్లో పారదర్శకతను తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు ఖర్చుల అంశానికి ఖచ్చితమైన ధరలు కూడా నిర్ణయించారు. ఈ ధరల జాబితాను శుక్రవారం విడుదల చేస్తూ, ఇకపై అభ్యర్థులు టీ తాగించినా, భారీ సభలు నిర్వహించినా ప్రతి పైసాకు కూడా లెక్క చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం, అభ్యర్థులు తమ రోజువారీ ఖర్చులను తప్పకుండా నమోదు చేసి అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను తుంగలో తొక్కితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** వెస్టిండీస్‌తో రెండో టెస్టులో భారత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (129*: 196 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ బాదాడు. కేవలం 177 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. అతడి కెరీర్‌లో ఇది 10వ సెంచరీ. మిగతా బ్యాటర్లూ రాణించడంతో రెండో రోజు రెండో సెషన్‌లోపే భారత్ తన తొలి ఇన్నింగ్స్‌ను 518/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. యశస్వి జైస్వాల్ (175), సాయిసుదర్శన్ (87), కేఎల్ రాహుల్ (38), నితీశ్‌కుమార్‌రెడ్డి (43) రాణించారు. వారికన్ 3, రోస్టన్ ఛేజ్ ఒక వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు విండీస్ జట్టు మ్యాచ్ ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది.

## నా పెళ్లే కాదు, హనీమూన్ కూడా ప్లాన్ చేయండి..



**స్టార్ హీరోయిన్ త్రిష మరోసారి పెళ్లి వార్తలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వయసు 40 దాటినా కుర్ర హీరోయిన్స్‌కి పోటీ ఇస్తున్న ఈ చెన్నై బ్యూటీ.. తాజాగా పెళ్లి వార్తలతో టాలీవుడ్, కోలీవుడ్ సర్కిల్స్‌లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులుగా త్రిష ఓ ప్రముఖ చెన్నై బిజినెస్ మెన్‌తో రిలేషన్‌లో ఉందని, ఇద్దరి మధ్య పెళ్లి డిస్కషన్స్ కూడా తుదిదశలో ఉన్నాయని కొన్ని పాపులర్ వెబ్‌సైట్లు రిపోర్ట్ చేశాయి. అయితే ఈ రూమర్లపై త్రిష సోషల్ మీడియాలో ఘాటుగా స్పందించింది. నా జీవితాన్ని ప్లాన్ చేస్తున్న వారిని నేను ప్రేమిస్తున్నా. హనీమూన్ షెడ్యూల్ కూడా వాళ్లే ప్రకటిస్తారేమో! వెయిట్ చెయ్యండి!" అంటూ సెటైరికల్ పోస్టు పెట్టింది.**

- అక్షరటుడే, సినిమా డెస్క్